క్లుప్తంగా

బిందు సేద్యంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్

కళ్యాణదుర్గం రూరల్: ప్రభుత్వం రాయితో అందిస్తున్న బిందు సేద్యం పరికరాల వినియోగంపై రైతులు అవగాహన పెంచుకోవాలని ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్ సూచించారు. ఎంఐఏఓ మల్లేష్, కెప్టెన్ కంపెనీ డీసీఓ ఆంజినేయులు, కొఠారీ ఎఫ్‌సీఓ పాలయ్యతో కలిసి బుధవారం మండల పరిధిలోని చాపిరితండా, కుర్లపల్లి, బోరంపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో డ్రిప్ మంజూరు చేసిన రైతుల పొలాలను సందర్శించారు. హనుమంతరాయుడు, శకుంతలమ్మ తదితరులు డ్రిప్‌తో సాగు చేసిన వేరుశనగను పరిశీలించారు. డ్రిప్ పరికరాలను ఎలా వినియోగించుకోవాలి, వాటిని శుభ్రం చేసుకునే విధానాలను వివరించారు.

హైమాస్ లైట్ల ఏర్పాటుకు నేడు భూమి పూజ

ఉరవకొండ: స్థానిక కవితా హోటల్ సర్కిల్ వద్ద ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం హైమాస్ లైట్స్ ఏర్పాటుకు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి భూమిపూజ చేస్తారని సర్పంచ్ లలితమ్మ, ఉపసర్పంచ్ వన్నప్ప ఓ ప్రకటనలో తెలిపారు.

అడవులకు నిప్పు పెడితే చర్యలు

కుందుర్పి: వేసవిలో అడవులకు నిప్పు పెడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జంబుగుంపల అటవీ బీట్ అధికారి పరమేశ్వరప్ప హెచ్చరించారు. బుధవారం మండలంలోని జంబుగుంపల పంచాయతీలోని ఐదు గ్రామాలు, బెస్తరపల్లిలో పశువుల కాపర్లతో సమావేశమయ్యారు. అడవులకు నిప్పు పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అడవులకు నిప్పు పెట్టినట్లు తెలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అడవులకు నిప్పు పడిన సమయాల్లో అటవీశాఖ అధికారులకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలమ్మ, సర్పంచ్ గంగాధర తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

రాయదుర్గంటౌన్: డోన్‌లో న్యాయవాదిపై జరిగిన దాడిని ఖండిస్తూ రాయదుర్గం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం న్యాయవాదులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లోకానంద మాట్లాడుతూ.. అడ్వకేట్‌పై దాడి శోచనీయమన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ 2021 బిల్లును ప్రభుత్వం ఆమోదించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి రాజేష్, సీనియర్ అడ్వకేట్ మల్లేశప్ప, కార్యదర్శి వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

నారాయణ సంస్థలపై చర్యలు తీసుకోండి

కళ్యాణదుర్గం రూరల్: జిల్లాలోని నారాయణ విద్యా సంస్థలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక నారాయణ పాఠశాల వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు హనుమంత రాయుడు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ మాట్లాడుతూ.. అనంతపురంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న నారాయణ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న కదిరికి చెందిన భవ్యశ్రీ అనే విద్యార్థిని ఫీజుల వేధింపులతో ఆత్మహత్యాయత్నం చేసిందన్నారు. ఇప్పటికే విద్యార్థిని తల్లిదండ్రులు రూ.10 వేల ఫీజు చెల్లించారని, కేవలం రూ.2,820 మాత్రమే పెండింగ్ ఉందన్నారు. అయినా కళాశాల సిబ్బంది ఫీజు కట్టాలని వేధించడంతో భవ్యశ్రీ కళాశాల భవనం పైకి ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని తెలిపారు. ఇప్పటికైనా ఆర్ఐఓ స్పందించి కళాశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

బస్సును ఢీకొన్న కారు



కళ్యాణదుర్గం రూరల్: మండల పరిధిలోని బోరంపల్లి వద్ద బుధవారం ఓ కారు బస్సును ఢీకొట్టింది. వివరాలు.. కళ్యాణదుర్గం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అనంతపురం నుంచి కళ్యాణదుర్గం వస్తుండగా.. వెనకాల రాయదుర్గానికి చెందిన కారు వస్తోంది. బోరంపల్లి పాలిటెక్నిక్ కళాశాల మలుపు వద్ద బస్సు బోరంపల్లిలోకి తిరుగుతుండగా.. కారు ఢీకొట్టింది. అయితే ఈ ఘటనలో కారు ముందు భాగం కొంత దెబ్బతింది. ఎవ్వరికీ గాయాలు కాలేదు. ఈ ఘటనపై సమాచారం అందలేదని రూరల్ పోలీసులు తెలిపారు.

శెట్టూరు: మండల పరిధిలోని మంగపల్లి వద్ద బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. అయ్యగార్లపల్లి గ్రామానికి చెందిన వడ్డే శ్రీరాములు కళ్యాణదుర్గం నుంచి సొంత గ్రామానికి వెళ్తున్నాడు. మంగంపల్లి క్రాస్ వద్ద బైక్‌ను అదుపు చేయలేక కిందపడ్డాడు. ఈ ఘటనలో గాయపడిన శ్రీరాములును కళ్యాణదుర్గం ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ యువరాజ్ తెలిపారు.

ఎల్లవేళలా జగన్‌కే మా అండ

- పథకాలు పారదర్శకంగా అందిస్తున్నారు
- మళ్లీ సీఎంగా జగన్‌ను గెలిపించుకుంటాం
- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో లబ్ధిదారుల హర్షం



కె.మారెంపల్లిలో బుక్‌లెట్లను అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి



చిన్నముస్టూరులో పథకాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

కణేకల్లు: అహర్నిశలు మా మేలు కోసం పరితపించే మా బిడ్డ.. మా అన్న.. మా మనవుడు జగన్‌కు ఏళ్లవేళలా అండగా నిలుస్తాం.. మా ఆశీర్వాదం ఎప్పుడూ ఆయనకే ఉంటుందని వృద్ధులు, డ్వాక్రా మహిళలు, వితంతువులు కాపు రామచంద్రారెడ్డికి భరోసా ఇచ్చారు. మండలంలోని కె.మారెంపల్లి గ్రామంలో బుధవారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం జరిగింది. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.మారెన్న, తిమ్మప్ప, నాగరాజు, డి.శ్రీనివాసులతో కలిసి విప్ కాపు ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అవ్వా.. పింఛన్ ప్రతి నెలా ఇంటికే వచ్చిస్తున్నారా? ఏం తల్లీ.. అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, చేదోడు డబ్బులు సక్రమంగా పడుతున్నాయా? రైతు భరోసా సాయం అందుతుందా? అంటూ విప్‌కాపు ఆరా తీశారు. జగనన్న సీఎం అయినప్పటి నుంచి తలుపు తట్టి పింఛన్ ఇచ్చి వెళుతున్నారని.. పింఛన్ కోసం గంటల కొద్ది కష్టాలు పడే రోజులు పోయాయని వృద్ధులు హర్షం వ్యక్తం చేశారు. మా అన్న సీఎం అయిన తర్వాతే మాకు అమ్మఒడి వస్తోందని విద్యార్థులు తెలిపారు. సీఎం జగన్ మేలును ఎన్నటికీ మరవమని ఆయన్ను నిండు మనస్సుతో ఆశీర్వదిస్తామని తెలిపారు.

కాలవ మాటలు నమ్మొద్దు

మరొక్క చాన్స్ ఇవ్వండి.. అన్నీ ఫ్రీగా ఇస్తామంటూ తుప్పు, పప్పు, మురికి కాలవ మీ ముందుకొస్తే నమ్మొద్దని ప్రజలకు సూచించారు. 2014లో అధికారంలోకి వచ్చేందుకు 600 హామీలిచ్చిన చంద్రబాబు వాటిలో ఏ ఒక్కటి సక్రమంగా నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు డి.పద్మావతి, ఎంపీపీ సంధ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టీ.కేశవరెడ్డి, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు పాటిల్ నాగిరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్ప చౌదరి, మాజీ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, వైస్ సర్పంచు నబీసా, జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యులు పెద్దదేవర మాబుపీరా, జేసీఎస్ కన్వీనర్ హనుమంతరావు, నాయకులు మారెంపల్లి రామన్న, వేమన, గోపాల్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొంగ పట్టాలతో మోసం చేసిన ఘనత పయ్యావులదే..

ఉరవకొండ: టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికలకు ముందు ప్రజలను మభ్యపెడుతూ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఉరవకొండ పట్టణంతో పాటు పలు గ్రామాల్లో దొంగపట్టాలు పంచి వారిని మోసగించారని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం మండల పరిధిలోని చిన్నముస్టూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే విశ్వకు మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ సుంకన్న అధ్వర్యంలో గ్రామ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా ఎంత మేర లబ్ధి పొందారో వివరిస్తూ బుక్‌లెట్లను అందజేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే విశ్వ మాట్లాడుతూ.. చిన్నముస్టూరు గ్రామంతో పాటు చాలా గ్రామాల్లో ఎమ్మెల్యే కేశవ్, ఆయా గ్రామాల టీడీపీ నాయకుల దుర్మార్గపు చర్యల కారణంగా పేదలకు పట్టాలు రాకుండా ఆలస్యం అవుతోందన్నారు. గతంలో కేశవ్ ఇచ్చిన పట్టాలను జాయింట్ కలెక్టర్ రద్దు చేశారని తెలిపారు. పేదలకు సంక్షేమ పథకాలు అందకుండా కేశవ్ గ్రామాల్లో కుట్రలు పన్నుతున్నారన్నారు. కేశవ్ సొంత పంచాయతీలో కూడా పేదలకు పట్టాలు రాకుండా వారికి సంక్షేమ పథకాలు రాకుండా అడ్డుపడుతున్నారన్నారు. కోర్టులో ఉన్న వారికి ఇప్పటికే ప్రభుత్వం నుంచి హామీ పత్రాలు కూడా మంజూరు చేయించామన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ సుంకన్న, సర్పంచ్ రామాంజినేయులు, మాజీ పెన్నహోబిలం డైరెక్టర్ ఈడిగ బాబు, మాజీ ఎంపీటీసీ లాలు, మార్కెట్ యార్డు చైర్మన్ సుశీలమ్మ, విడపనకల్లు ఎంపీపీ కరణం పుష్పవతి, ఉరవకొండ జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, వైస్ ఎంపీపీలు వై.శ్రీనాథ్‌రెడ్డి, నరసింహులు, ఆమిద్యాల పీఏసీఎస్ చైర్మన్ తేజోనాథ్, పెన్నహోబిలం ఆలయ మాజీ చైర్మన్ అశోక్, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, ఓబన్న, ఉరవకొండ పట్టణ కన్వీనర్ బ్యాంకు ఓబుళేసు, సింగాడి తిప్పయ్య, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మీరంబాషా, పెద్ద ముస్టూరు వెంకటేష్, ముండాసు ఓబుళేసు, వంకాయల గోవిందు పాల్గొన్నారు.

పాదయాత్రకు సంఘీభావం..

ఉరవకొండ: తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టిన ప్రజా సంక్షేమయాత్రతో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం అవుతుందని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం పెద్దవడుగూరు మండలం దిమ్మగుడి వద్ద పెద్దారెడ్డిని కలిసి, పాదయాత్రకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపడుతున్న ప్రజా సంకల్ప యాత్రకు మాజీ ఎమ్మెల్యే విశ్వ సంఘీభావం తెలిపి పాదయాత్రలో పాల్గొన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ .. ఈపాదయాత్రతో జేసీ బ్రదర్స్ రాజకీయ సమాధి తప్పదని, ప్రజలు ఇక జేసీ బ్రదర్స్‌ను నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దారెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమన్నారు.

రూ.3.81 లక్షల లబ్ధి



పేదల కోసం అహర్నిశలు కష్టపడే జగనన్నే మళ్లీ సీఎం కావాలి. జగన్ సీఎం అయ్యాక పథకాలు అందుతున్నాయి. గతంలో ఇలా పథకాల ద్వారా సాయం అందలేదు. మా కుటుంబనానికి వివిధ పథకాల ద్వారా రూ.3.81 లక్షల లబ్ధి చేకూరింది. జగనన్న చేసిన ఈ సాయాన్ని నేను ఎన్నటికీ మరవను. ఆయనకు ఏళ్లవేళలా అండగా ఉంటాం.

– ఉప్పర తిప్పమ్మ, మారెంపల్లి

రేపటి విజయసారథులు మీరే

- ప్రభుత్వ విప్ కాపు



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

బొమ్మనహాళ్: వైఎస్సార్‌సీపీ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లే రేపటి విజయసారథులని ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని ఉద్దేహాళ్, కల్లుదేవనహళ్లి గ్రామాల్లో మా నమ్మకం–నువ్వే జగన్ కార్యక్రమాన్ని గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీరందరూ కష్టపడి పనిచేస్తే రానున్న ఎన్నికల్లో మనకు అధికారం సునాయసమేనన్నారు. పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తకు తప్పకుండా న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు పథకాల వివరాలతో పాటు ప్రతిపక్షాలు ప్రభుత్వంపై చేస్తున్న కుట్రలు, కుతంత్రాలు వివరించాలని సూచించారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు హయాంలో అర్హత ఉన్నప్పటికీ పేదలకు ఇళ్లు ఇవ్వలేదన్నారు. అయితే నేడు పేదల సొంతఇంటి కల నెరవేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగనన్నకి మాత్రమే దక్కుతుందన్నారు. 2024 లోనూ వైఎస్సార్‌సీపీ తప్పకుండా అధికారంలోకి వస్తుందన్నారు. సచివాలయాల కన్వీనర్లకు కిట్లు వచ్చాయని, ఇందులో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు, గత రాక్షస పాలన–ప్రస్తుత పాలనలో ఉన్న తేడాలు తెలిపే కరపత్రాలు, ప్రజా మద్దతు పుస్తకం, జగనన్న ఫోటోతో ఉన్న మొబైల్ స్టిక్కర్లు ఉన్నాయన్నారు. వీటిని సచివాలయాల వారీగా అందజేస్తున్నామన్నారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధి పొందిన ప్రతి ఇంటికీ స్టిక్కర్లు అతికించాలన్నరు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, సీనియర్ నేతలు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, కోటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ రమేష్, మనోహర్‌శెట్టి, కో–ఆప్షన్ మెంబర్ మాబుసాబ్, సర్పంచ్‌లు యోగేశ్వరరెడ్డి, జయరామ్‌రెడ్డి, గాదిలింగ, ఆంజినేయులు, కృష్ణ, ముక్కన్న, ఎంపీటీసీలు హనుమేష్, వెంకటేష్, యువరాజ్ స్వామి, తిమ్మప్ప, రామకృష్ణ, నాయకులు ఎంసీహెచ్ రాజ్‌కుమార్, వన్నూరుస్వామి, ఆనంద్, బసవరాజు పాల్గొన్నారు.

ఎవరేం చేశారో తేల్చుకుందాం.. రండి

కణేకల్లు: ఐదేళ్ల బాబు పాలనలో మీరేం చేశారో జగనన్న మూడున్నరేళ్ల పాలనలో మేం ఏం చేశామో ప్రజల్లోకెళ్లి తేల్చుకుందాం.. రండీ అని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి టీడీపీ నేతలకు సవాల్ విసిరారు. ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చి జనాల్లో మేము వెళ్లేలా జగన్ ఓ మంచి వాతావరణం కల్పించారని స్పష్టం చేశారు. బుధవారం స్థానిక కేసీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో కణేకల్లు మండల గృహసారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో సమావేశం జరిగింది. అ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాబు పాలనలో వివిధ రూపాల్లో టీడీపీ నేతల ఇళ్లకు ప్రజాధనమంతా వెళ్లితే.. జగనన్న పాలనలో సంక్షేమ పథకాల ద్వారా పేదల ఇళ్లకు వెళుతోందన్నారు. లక్షల కోట్ల రూపాలయ ధనాన్ని టీడీపీ నేతలు పందికొక్కుల్లా మెక్కేశారన్నారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ, 'నాడు–నేడు' స్కూళ్ల భవనాల నిర్మాణాలు, ఆసుపత్రి భవనాల నిర్మాణ పనులన్నీ అప్పుడేందుకు చేయలేదని కాపు టీడీపీ నేతలను ప్రశ్నించారు.

మీ శ్రమ, కష్టం వల్లే ఎమ్మెల్యే అయ్యాను..

మీ శ్రమ, కష్టం.. ఫలితంగానే నేను ఎమ్మెల్యే అయ్యా... జగనన్న సీఎం అయ్యారు. మీరు కష్టపడకపోయి ఉంటే ఈ పదవులు వచ్చే కావు.. మీరే లేకుంటే మేము ఇక్కడ ఉండేవాళ్లమే కాదు. మీ శ్రమను జగనన్న ఎన్నటికీ మరవడని భవిష్యత్తులో మీకు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు డి.పద్మావతి, ఎంపీపీ సంధ్య, వైస్ ఎంపీపీ లీలావతి, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు పాటిల్ నాగిరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు పైనేటి తిమ్మప్పచౌదరి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టీ.కేశవరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ హనుమంతరావు, జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యులు మాబుపీరా, నాయకులు డాక్టర్ సోమన్న, నబీసా, మారెంపల్లి మారెన్న, యంద్రకాయల వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

11న ఉచిత వైద్యశిబిరం

కుందుర్పి: స్థానిక ఉన్నతపాఠశాల ఆవరణలో ఈనెల 11వ తేదీన శాంతిరామ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత గుండె, కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వైస్ ఎంపీపీ శ్రీలక్ష్మీ, లక్ష్మీ నృసింహ స్వామి ఆలయ ధర్మకర్త సత్యనారాయణశాస్త్రి, సర్పంచ్ మారుతేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. రోగులు రేషన్‌కార్డు, ఆధార్, రెండు పాస్‌ఫోటోలు తీసుకురావాలని సూచించారు.

జీఓ వెనక్కి తీసుకోవాలి

రాయదుర్గం రూరల్: గతంలో డిగ్రీ ఫెయిల్ అయిన విద్యార్థులు పాస్ అయ్యేందుకు 9 సంవత్సరాలు గడువు ఉండేదని, ప్రస్తుతం ఆ గడువును మూడేళ్లకు కుదిస్తూ ఎస్ కె యూనివర్సిటీ జీఓ విడుదల చేయడం బాధాకరమని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు అంజి, కొత్రేష్ , బంగి శివ అన్నారు. బుధవారం స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. కుదింపు జీఓను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాతవిధానాన్ని యథావిధిగా కొనసాగించాలన్నారు. లేకపోతే యూనివర్సిటీని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఉరవకొండ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా చంద్రమౌళి



ఉరవకొండ: వజ్రకరూరు ఎంపీడీఓగా విధులు నిర్వర్తిస్తున్న చంద్రమౌళికి ఉరవకొండ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీఓ అమృతరాజు జిల్లా పరిషత్ కార్యాలయానికి బదిలీ కావడంతో వజ్రకరూరు ఎంపీడీఓను ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

బిందుసేద్య పరికరాల పంపిణీ



ఎర్రగుంటలో బిందుసేద్య పరికరాలు పంపిణీ చేస్తున్న అధికారులు

కుందుర్పి: కళ్యాణదుర్గం డివిజన్ వ్యాప్తంగా 6 వేల హెక్టార్లలో సాగు చేసిన రబీ పంటలకు సంబంధించి బిందుసేద్య పరికరాలు పంపిణీ చేసినట్లు ఏడీఏ యల్లప్ప తెలిపారు. ప్రభుత్వం సబ్సిడీపై ఒక్కో రైతులకు 40 స్ప్రింక్లర్ పైపులు 9 గన్నులు అందజేశామన్నారు. ఇలా డివిజన్‌లోని ఐదు మండలాల్లో 3,600 మంది రైతులకు బిందుసేద్యం పరికరాలు అందించినట్లు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఎర్రగుంటలో 60 మంది రైతులకు పరకరాలు అందించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు వన్నూర్‌రెడ్డి, సర్పంచ్ విశాలాక్షి పాల్గొన్నారు.

రాయంపల్లిలో పశువిజ్ఞాన బడి

రాయదుర్గం రూరల్: పాడిపశువుల వైద్యం కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం సంచార వైద్యశాలలను ప్రవేశపెట్టిందని, రైతులు పాడిపశువుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని ఆవులదట్ల వెటర్నరీ డాక్టర్ శిరీష అన్నారు. బుధవారం మండలంలోని రాయంపల్లి ఎంపీపీ పాఠశాల ఆవరణలో పశువిజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. పాడి పశువులకు టీకాలు వేశారు. 90 శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందిస్తున్న టీకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు గృహసారథులకు శిక్షణ

బ్రహ్మసముద్రం: మండల పరిధిలోని సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు గురువారం కళ్యాణదుర్గంలోని మంత్రి ఉషశ్రీరణ్ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి, మండల కన్వీనర్ బసవరాజు ఓ ప్రకటనలో తెలిపారు. మంత్రి ఉషశ్రీచరణ్ హాజరయ్యే సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల వలంటీర్లు, గృహ సారథులు వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరుకావాలని కోరారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

ఉరవకొండ: మండల పరిధిలోని పెద్ద ముస్టూరులో గురువారం మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల రూరల్ కన్వీనర్ వెలిగొండ నరసింహులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సజావుగా వాహనాల వేలం



కంబదూరు: పోలీస్ స్టేషన్‌లో సూచనలిస్తున్న పోలీసులు

శెట్టూరు: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ మద్యం కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు బుధవారం ఎక్సైజ్ సీఐ బాషా, ఎస్ఐ యువరాజ్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. 12 ద్విచక్ర వాహనాలను వేలం వేయగా.. 11 వాహనాలు అమ్ముడు బోయాయి. ఒక వాహనం మిగిలిపోయింది. జీఎస్టీతో కలిపి మొత్తం రూ.1,40,420 ప్రభుత్వానికి ఆదాయం వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

కంబదూరులో..

కంబదూరు: స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో అక్రమ కర్ణాటక మద్యం రవాణా కేసుల్లో పట్టుబడిన 51 ద్విచక్ర వాహనాలకు బుధవారం సెబ్ సీఐ మొహిద్దీన్ బాషా ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.11,31,384 ఆదాయం వచ్చినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

మార్చి 9, 10 తేదీల్లో ఇజ్తేమా

రాయదుర్గంటౌన్: పట్టణంలోని షాదీహాల్ వద్ద మార్చి 9, 10 తేదీల్లో తబ్లిగి జమాత్ ఇజ్తేమా (ఆధ్యాత్మిక సమ్మేళనం) నిర్వహించనున్నట్లు జమాత్ నిర్వాహకులు తెలిపారు. ఖాజీ సైఫుల్లా, జమాత్ నిర్వాహకులు మజీద్‌సాబ్, వలి, జాకీర్, దాదు, రిజ్వాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ వలిబాషా, కౌన్సిలర్ ఫకృద్దీన్, షబ్బీర్ తదితరులు బుధవారం అనుమతులు కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, తహశీల్దార్ మారుతి, సీఐ యుగంధర్‌లను కలిసి వినతిపత్రాలు అందజేశారు.

ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా పప్పుశనగ కొనుగోలు



మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాస్

బెళుగుప్ప/బ్రహ్మసముద్రం: ఈనెల 10వ తేదీ నుంచి మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కనీస మద్దతు ధరతో పప్పుశనగ విక్రయాలకు రైతుల పేర్ల నమోదు ప్రక్రియ ప్రారంభం అవుతుందని బెళుగుప్ప, బ్రహ్మసముద్రం, ఏఓలు పృథ్వీసాగర్, సరిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పప్పుశనగకు ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.5,335గా నిర్ణయించిందన్నారు. ప్రభుత్వానికి పప్పుశనగ విక్రయించాలనుకునే రైతుల పేర్లు ఈ–క్రాప్‌లో నమోదై ఉండాలన్నారు.

వజ్రకరూరు: మండలంలో త్వరలో పప్పుశనగ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు ఏఓ ఎంఆర్ శ్రీనివాస్ తెలిపారు. మండల వ్యాప్తంగా రబీ సీజన్‌లో 18,100 ఎకరాల్లో పప్పుశనగ సాగైనట్లు పేర్కొన్నారు. గడేహోతురు, చిన్నహోతురు గ్రామాల్లో రైతులు సాగు చేసిన మొక్క జొన్న పంటను బుధవారం ఆయన పరిశీలించారు. తప్పనిసరిగా ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం గడేహోతురు, చిన్న హోతురులోని ఆర్బీకేలను తనిఖీ చేసి, పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీహెచ్ఈఓ ప్రమీళ, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ఇందు ఉన్నారు.

అన్నదానానికి బియ్యం వితరణ



వాహనాల్లో బియ్యం, ఇతర వస్తువులను తరలిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: కర్నూలు జిల్లా, కోడుమూరు మండలం పాలకుర్తి గ్రామంలో శ్రీసాయి సేవాశ్రయంలో వారం రోజుల పాటు నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి బొమ్మనహాళ్ మండలం దేవగిరి గ్రామస్తులు, భక్తులు రూ.5 లక్షల విలువలైన ఆహార వస్తువులు వితరణ చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆశీస్సులతో 12 సంవత్సరాల నుంచి బియ్యం, వంట నూనె, కందిబాల్లు, శనగబ్యాళ్లు, చక్కెర, బెల్లం తదితర వంట వస్తువులను పంపిస్తున్నామని తెలిపారు. కొంతమంది భక్తులు పాదయాత్రగా వెళ్లి అక్కడ వారం రోజుల పాటు జరిగే అన్నదానం కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు.

మల్లేశ్వరుడి హుండీ కానుకల లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న కమిటీ సభ్యులు, గ్రామస్తులు

కంబదూరు: మండల కేంద్రంలోని పురాతన మల్లేశ్వరస్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ.1,16,012 ఆదాయం సమకూరినట్లు ఆలయ ధర్మకర్త మల్లురి వెంకటేశులు తెలిపారు. గత ఏడాది శివరాత్రి నుంచి ఇప్పటి వరకూ భక్తులు హుండీల్లోకి వేసిన కానుకలను బుధవారం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో లెక్కించామన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వసంత రాయుడు,చంద్ర, బేల్దారి హనుమంతరాయుడు, వడ్డే అంజి, ప్రసాద్, కొడతల ప్రసాద్, నీళ్ల బాబు, మేడి నాగ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

గుమ్మఘట్ట: మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనుల రూపకల్పనకు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు వెల్లడించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి నిర్మల్‌కుమార్ మాట్లాడుతూ.. మండలానికి మూడు డ్రోన్‌లు మంజూరయ్యాయని వాటి ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. అందులో రూ.4 లక్షలు సబ్సిడీ పోగా.. రూ.లక్ష రైతు చెల్లించాలన్నారు. రూ.5 లక్షలు బ్యాంకు రుణం రూపంలో అందజేస్తాయన్నారు. ఆర్బీకేల్లో రసాయనిక ఎరువులు, నాణ్యమైన విత్తనాలు, క్రిమిసంహారక మందులు అందుబాటులో ఉంచినట్లు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధాన ఇచ్చారు. రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలకు తప్పనిసరిగా ఈ–క్రాప్ బుకింగ్, ఈ–కేవైసీ చేయించుకోవాలని సూచించారు. కే.పి.దొడ్డి, ఆర్.కొత్తపల్లి, పూలకుంట, గోనబావి గ్రామాల్లో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను మార్పు చేయాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కవిత తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ భవాని, తహసీల్దార్ వేణుగోపాల్, వైస్ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, జయమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ ప్రణీత, ఎంపీటీసీలు, సర్పంచులు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.